


# కనిగిరి పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్‌వారి కాట్లాట!

## ఇద్దరూచేరి కడకు కమ్యూనిస్టులకప్పజెప్తారా?

కనిగిరి పంచాయతీకి యీ నెల 18 తేది ఎన్నికలు జరుగనున్నవి. 1 తేది నామినేషన్లు వేయడం పూర్తిఅయింది.

ఇదివరలో కాంగ్రెస్ వ్యతిరేకులచేతిలో వుండిన యీ మేజరు పంచాయతీ, ఈ దఫా కూడా వారిచేతిలోకి పోవడమటుంచి, సమితి ఎన్నికలలో పరాజయం పొందిన కమ్యూనిస్టులకు, ఈపంచాయతీలో ప్రాబల్యం లభిస్తుందా అనే సందేహం కలుగుతున్నది. ఇలా సందేహపడుటకు కారణం కమ్యూనిస్టుల బలం పెరిగికాదు, కాంగ్రెస్ వాదులలో కలతలు ఎక్కువగావడమే! పాత కాంగ్రెస్‌వాది, న్యాయవాది శ్రీ దేవిరెడ్డి లక్ష్మీరెడ్డి – క్రొత్త యువకాంగ్రెస్ వాది శ్రీ వి. రామసుబ్బారెడ్డికి మధ్య వచ్చిన విభేదాలు యీ పరిస్థితికి దారితీస్తున్నవి.

లక్ష్మీరెడ్డిగారు కమ్యూనిస్టులతో చేరి కాంగ్రెస్‌పై తిరుగుబాటు చేస్తున్నారని, కాంగ్రెస్‌ను బహిరంగంగా దూషిస్తున్నారని జిల్లాకాంగ్రెస్ జోక్యం కల్గించుకొని సర్దుబాటు చేయకుంటే 1962లో కాంగ్రెస్‌కు తీరనిదెబ్బని, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ వై. సంగయ్య శ్రీ ఆనం సంజీవరెడ్డిగారికి ఒక నివేదిక ద్వారా తెలియజేశాడు.

లక్ష్మీరెడ్డిగారు యీనాటి కాంగ్రెస్ వాదికాదు. రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల విచారణాధికారిగా పదిహేనేళ్ళక్రితమే పనిచేసిన వ్యక్తి. గత రెండు జనరల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులకు హృదయపూర్వకంగా పనిచేసినవ్యక్తి. సౌమ్యస్వభావుడు, అలాంటి వ్యక్తి యీనాడు కమ్యూనిస్టులతో చేరి కాంగ్రెస్‌పై ధ్వజమెత్తుతున్నారంటే నమ్మలేకున్నాము. ఒకవేళ అది యదార్థమైతే, స్థానికంగా కాంగ్రెస్‌వారితో విభేదాలుండవచ్చు, జిల్లా నాయకులపై అసంతృప్తి వుండవచ్చు, లేకపోతే వారి వైఖరి అనాదార్యవంతమైనదై వుండవచ్చు, అంతమాత్రాన కమ్యూనిస్టులకు స్థానం కల్పించడం లక్ష్మీరెడ్డిగారి పోటి పాతకాంగ్రెస్ వాదికి పాడిగాదు. అసలు లక్ష్మీరెడ్డిగారిపోటి విద్యార్థికుడు స్వల్పమైన యీ పంచాయతీ ఎన్నికలలో తలదూర్చడమే సమంజసంగా లేదు, లక్ష్మీరెడ్డిగారు స్థానిక కాంగ్రెస్ వారితో సహకరించడం యిష్టంలేకుంటే మౌనంగా వుండిపోవడం, కనీసం కమ్యూనిస్టులతో సహకరించకుండడం ధర్మం. ఇప్పుడు అధికారయుతంగా కాంగ్రెస్ పోటీచేయడం లేదనేది యదార్థమైనా, యిక్కడి తనచర్య భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అపకారిగా పరిణమిస్తుందనేది లక్ష్మీరెడ్డిగారు గమనించవలెను.

—సీ. లైషి.

### వెంకటాచలం సమితి

గత 14 తేది [illegible] గొమ్ములపూడిలో శ్రీ రామిరెడ్డి దశరథరామరెడ్డిగారి అధ్యక్షతన జరిగిన సమితి బడ్జెటు సమావేశంలో 25 పంచాయతీలకు సంబంధించిన 1960–61 సంవత్సర ఆదాయవ్యయాలను ఆమోదిస్తూ తీర్మానించబడింది. స్థానికసిబ్బంది గృహనిర్మాణానికి, ఆఫీసు విస్తరణనిమిత్తం 50 వేల రూపాయలను మంజూరుచేస్తూ కూడా తీర్మానించబడింది. అక్కంపేట నుండి ఆమంచర్ల వరకు కరువుపనిక్రింద రోడ్డు నిర్మించుటకు నిర్ణయించబడింది. 1960–61 సంవత్సరములో చేయదలచిన అభివృద్ధి కార్యక్రమాల సంగ్రహానికి కూడా ఆమోదించబడింది.

—ఓ. వి.

### కావిరెడ్డిపాడు స్కూలు

ఆత్మకూరు శాసనసభ్యుడు శ్రీ ఆనం సంజీవరెడ్డిగారి గ్రామమైన కావిరెడ్డిపాడు స్పెషల్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూలులో యీ సంవత్సరం ఇ. యస్. యల్. సి. కి 20 మంది విద్యార్థులుపోగా, 17 మంది ఉత్తీర్ణులయ్యారట. అంటే నూటికి 85 మంది పాసయ్యారన్నమాట. అభినందనీయమైన ఫలితం.

—గ్రామస్థుడు.

### కావలి పంచాయతీలు

కావలి తాలూకా పంచాయతీ సంఘ సభ్యులు సంఘ కార్యవర్గ నిర్మాణంలో 15–2–60 తేది సమావేశంలో వారిచ్చిన అధికారాన్ని పురస్కరించుకొని యీ క్రింది కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నాను–

శ్రీ పోలిశెట్టి కొండయ్యనాయుడు – ఉపాధ్యక్షుడు; శ్రీ బొడ్డరెడ్డి బాలురెడ్డి – ప్రధానకార్యదర్శి; శ్రీ రేపూరు కృష్ణమూర్తి. సహాయ కార్యదర్శి; ఆమిరిశెట్టి వెంకటసుబ్బయ్య–కోశాధికారి; శ్రీయుతులు వేమిరెడ్డి అయ్యపరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడు, తిప్పారెడ్డి యల్లమందారెడ్డి, వంటేరు వరదారెడ్డి, పుట్టంరెడ్డి రామరెడ్డి– సభ్యులు.

—బండి గోపాలరెడ్డి.

### అత్తివరం వీడ్కోలు

అత్తివరం గ్రామసేవకుడు శ్రీ బి. నారాయణరెడ్డి బదిలీకాబడిన సందర్భంలో, శ్రీ మునుకూరు సుందరరామరెడ్డిగారి అధ్యక్షతన 1 తేది వీడ్కోలుసభ జరిగింది. పంచాయతీ అధ్యక్షుడు శ్రీ సి. వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీ కె. రామరాఘవరెడ్డి, శ్రీ వై. రాజారెడ్డి, శ్రీ ఇ. సుబ్బయ్య, శ్రీ హెచ్. శ్రీనివాసులుగారలు నారాయణరెడ్డిగారి సేవలను కొనియాడుతూ, అత్తివరం ఆదర్శగ్రామంగా పరిగణింపబడుటకు వారి ఆదర్శకృషి కారణమన్నారు. తర్వాత అల్పాహారవిందు, ఛాయాచిత్రగ్రహణం జరిగినవి.

—హెచ్. శ్రీనివాసులు.

### కోటికి పడగెత్తిన వెంకన్న!

ఏడుకొండల వెంకన్న ఆదాయం ఏటేటికి పెరిగిపోతున్నది. సౌకర్యాలతోపాటు యాత్రికులు, యాత్రికులతోపాటు రాబడి ఎక్కువవుతున్నది. 1933 లో 11 లక్షలు, 1949 లో 30 లక్షలు, 1959 లో 78 లక్షలు వుండిన ఆదాయం, ఈఏడు కోటికి పెరిగింది. గతసంవత్సరం తలపెట్టిన పనులకు ధనాభావం కలుగుతుందని పాలకవర్గం భయపడగా, అఖర్చులుబోను మిగులు ఏర్పడటం విశేషం. స్వామి మహాత్మ్యానికి యిది ప్రత్యక్ష నిదర్శనం!

### నాయుడుపేట క్యాంపు

నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి బ్లాకులకు చెందిన 50 మంది సమితి సభ్యులకు పంచాయతీ సమితిపాలన, సమాజ వికాస కార్యక్రమాలకు సంబంధించి శిక్షణ గరపుటకు గత 23 తేది నుండి 30 తేదివరకు శిబిరం నిర్వహించబడింది. జిల్లా పంచాయతీ ఆఫీసరు శ్రీ వి. సుబ్బారెడ్డి, అంధ్రకార సభ్యులు ముగ్గురు వివిధవిషయాలపై ఉపన్యాసాలిచ్చారు. బి. డి. ఓ. శ్రీ కె. వెంకటచలంగారు ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. సాంఘిక విద్యాప్రచారకుడు శ్రీ చక్రవర్తి ఆత్రేయ కుటుంబ నియంత్రణాన్ని గూర్చి చక్కని గోష్ఠి జరిపారు.

—ఓ. వి.

—కొరవ 11 వ పేజీలో

